


సరస్వతమ్మ, చలపతి, మంచంమీద పడుకున్నారు. సరస్వతమ్మ లావణ్యవతి కాదు. చలపతి యౌవనవంతుడూ కాడు. ఇప్పుడు-అవన్నీ పేరుకున్న పంచాంగం కట్టలకి తెల్సు. ''ఆ మంచం'' సరస్వతమ్మ వాళ్ళ నాన్నగారు ఆమెకి ''సారె'' పెట్టాడు ఎప్పుడో పెళ్ళప్పుడు, చిన్నప్పుడు.

కొత్త 'నవ్వారు'తో కొండంత కోర్కెలతో సరస్వతి చలపతితో కల్సిపోయిందా మంచం మీదే– ఆ తర్వాత మళ్ళీ ఆ 'నవ్వారు' మార్చటం పణ్ణేలేదు- ముక్కలవుతూన్న పట్టెడని ఎన్నిసార్లు అతుకెట్టిందో 'పడుచుదనం' సందట్లో.

చలపతి రిటయిరయి రెండేళ్ళుగా పింఛను పుచ్చుకొంటున్నాడు. ఇన్నేళ్ళ జీవితంలో తాను మిగుల్చుకున్నది నాలుగు పుత్రరత్నాల సంసారాన్ని. తెగిపోయిన నవ్వారు తీసి కొత్తది నేయలేకపోయాడు. ఓ లెక్కలో ఆ అతుకుల పట్టెడ తపు బతుకులను కాసింది. చాలా రాత్రుళ్లు తెగిపోతూన్న గొంతుకతో ఎగిసిపడుతున్న వారి కోరికలని చల్లార్చింది. హెచ్చరించింది అప్పట్లో- ఇప్పుడు వయసు తగ్గింది, మిసిమి తగ్గింది, వేడి తగ్గింది, వాడి తగ్గింది, వడలిన శరీరాలు తేలికయాయి, సొమ్మసిల్లాయి. ఈనాడు కొత్తగా తెగేదేంలేక కుట్టబడని తాళ్ళు మాత్రం మంచం కాళ్ళకి వేళ్లై సాయపడుతున్నాయి.

చలపతి తర్వాత నాలుగు మంచాలు కొన్నాడు- నాలుగు పెళ్ళిళ్ళు చేశాడు- కొడుకులందరూ తలోటీ పట్టుకెళ్ళేరు- దేశానికో గుమాస్తానీ, ఇద్దరు టీచర్లనీ, ఓ మెసింజర్నీ ప్రసాదించాడు ఉడతాభక్తిగా–

చలపతి ఆ పక్కకి తిరిగి పడుకున్నాడు. సరస్వతి ఇంకా దగ్గుతూనేవుంది.

అతనికి పట్టిన కునుకు కరిగిపోతోంది.

"దగ్గు యివాళ మరీ యెక్కువగా వున్నట్టుంది" బాధ, విసుగూ, ఆందోళనా, యింకా యేవేవో వినిపించాయా గొంతులో.

"ఈ ఒక్కరోజూ క్రింద పడుకుంటే ఏమైపోతాన్ట?" దగ్గు తెరల్లోంచి చించుకొచ్చింది సరస్వతి మాట.

"నువ్వసలు చెప్పింది వినిపించుకోవు. నీవీ నేలమీద పడుకుంటే. రేపు మళ్ళీ నీకు ఒళ్ళు కాయలేక నే ఛావాలి" మళ్ళీ కసురుకున్నాడు. "నేకింద పడుకుంటానంటే వినవు నీ పంతం నీదే" సణిగేడు.

అవును. ఆమె పంతం ఆమెదే. ఆ పంతమే నెగ్గుతోంది ఎప్పుడూ. పెద్ద కోడలు తగువుపడి విడిపోయినప్పుడూ చిన్నవాడు తనమీద చెయ్యి చేసుకున్నప్పుడూ, మూడోవాడు కోపం వచ్చి వెళ్ళిపోయినప్పుడూ. నాలుగోవాడు ప్రేమించి పెళ్ళి చేసుకున్నప్పుడూ అన్నింటికీ తండ్రీ కొడుకుల సంఘర్షణలో తను వాళ్ళనే గెలిపించింది- తానన్నీ వదులుకుంది- భర్త అభిమతానికి విరుద్ధంగా నడుస్తున్నానన్న విచారం ఓ పక్కా.... "ఎక్కడున్నా వాళ్ళు నా కొడుకులే" అనే సర్దుబాటు మరో పక్కా.... చాలా సమయాల్లో భర్తకి ఓదార్పునిచ్చేది. కొడుకుల అభ్యున్నతిని 'వర్ణించి' చెప్పేది– కల్లలాడేది- కప్పి చెప్పేది. తనుమాత్రం అతనికోసమే బతుకుతోంది-అతనికోసమే జీవిస్తోంది.


సరస్వతమ్మని అనారోగ్యం ఆవహించింది- చలపతిరావుని బడలికకమ్మేసింది. ఇద్దరూ పండినఆకులా, సంధ్య మెరుపులా మిగిలివున్నారు. 'ఎవరుముందు' అన్నట్లువున్నారు.

తెల్లారింది. రాత్రి నిద్దర్లేని కళ్ళలా సూర్యుడు ఉదయించాడు. రోజూలా చలపతి కాలవ స్నానానికి బైల్దేరాడు. సరస్వతమ్మ బోల్డన్ని కలలు కలిపిన నీళ్ళతో ఎప్పట్లాగే కళాపిజల్లి ముగ్గుకర్ర లాగేసింది. వెనక్కి నడవబోయి. కళ్ళు తిరిగినట్లయి, వళ్లుతూలి, ఎలాగో మంచం వరకూ చేరుకుంది. మంచంమీద కూచునేంతలో తను వామె స్వాధీనం తప్పింది. ఆమె ప్రయత్నం విఫలమయింది. ఆ తర్వాత జరిగింది ఆమెకి తెలియదు.

చలపతి జపం ముగించి తడిబట్టలు భుజాన వేసుకుని గృహప్రవేశం చేశాడు. "సగం క్రిందా——సగం పైనా" అస్తవ్యస్తంగా వుంది సరస్వతి.

"సరస్వతీ!!" పిలిచాడు, అరిచాడు.

స్పృహలేదు. గబగబ లేనిబలం తెచ్చుకుని పూర్తిగా మంచం మీదకు సర్దాడు,



మాటలేదు. చూపులేదు. ప్రాణానికి సాక్షిగా గుండె సవ్వడి. వంటి వేడి వున్నాయి. చలపతికి వళ్ళు చల్లబడింది. కంగారు వణుకయింది.

ఎదురింటి గుర్నాధాన్ని గొంతెత్తి పిల్చాడు పరిస్థితి చూశాడు తనని రొండు తిటుకున్నాడు. నొసట కొట్టుకున్నాడు. గుండె బాదుకున్నాడు. గొంతు తడుపుకున్నాడు.

గుర్నాధం డాక్టరు కోసం పరిగెత్తాడు.

డాక్టరు చెప్పాడు "ఫెరాల్సిస్-కోమా చెప్పలేం! ఇవాళా రేపా అన్నది." ఇలాగే వారం తీసుకుపోయిన రామారావు కథ. వెంటనే పోయిన వెంకట్రావు కథా చెప్పాడు- 'పోవటంమాత్రం ఖాయ'మని నిశ్చయం చేశాడు.

గుర్నాధమే ఉత్తరాలూసలోని చిట్ట చివరి లోతుల్లో 'డబ్బు పంపమంటూ' పుత్రరత్నాలు రాసిన పాత ఉత్తరాలోని చిరునామాలు వెలికితీశాడు.

పెలిగ్రాం చూసుకుని మూడోవాడూ, నాలుగోవాడు సాయంత్రానికి వచ్చారు. సరస్వతమ్మ మరి కాజాలు చేయలేదు. మినప సున్నికి పిండివిసర్లేదు. కొడుకులకి యిదివరకులా కాళ్ళకు నీళ్ళందించలేదు. "చిక్కిపోయారేమర్రా" అని కన్నీళ్ళు నించలేదు.

ఆమె గుండెలమీద చెయ్యేసి "సమ్" తృప్తిగా దుఃఖిస్తున్నాడు చలపతిరావు. గొంతుపెగలక చేత్తోనే "బతికుందని" చెప్తున్నాడు చుట్టూ జనానికి. ఉండుండి కొడుకులకేసి చూస్తున్నాడు. వాళ్ళ చూపు లిటు తిరిగితే భార్యకేసి చూస్తున్నాడు.

అస్త్రాదికి సప్తాశ్వరథారూఢుడు మళ్ళాడు- ఇంటిముందు గుర్రబ్బండి ఆగింది. పెద్దకొడుకుబండిలోంచి దూకాడు. కోడలు శరీరాన్ని కొసకి తెచ్చింది. బండివాడు గుర్రాన్ని తేలకుండా నొక్కిప్పాడు శాయశకులా. క్రింద కురికిందికాంతమ్మ. కంగారుగా పరుగెత్తి అత్తగారి మంచం పట్టెమీద కూలబడింది.

అంత బరువూహించని మంచం నడుం విరిగి ఫెళుక్కుమని అరిచింది. చలపతి మనస్సు కళుక్కుమంది. సరస్వతితో కాపురాని కొచ్చిన మంచం. జరకూడన్ది జరుగుతున్నట్లుగా ఉలిక్కిపడ్డాడు. సరస్వతికి స్పృహ వుంటే చురుక్కున తనకేసి చూసేది- చటుక్కున కుర్చీపీటతెచ్చి విరిగిన మంచం కిందికి తోసి నిలబెట్టి 'బోటు' పెట్టాడు- ఆ సర్దుబాటులో సరస్వతి కదిలింది. పొద్దుణ్నించీ మొదటిసారి కదిలింది. డాక్టరు పగర్వంగా చూశాడు. తను చేసిన ఐదు ఇంజక్షన్స్ ఫలితమే ఇదనుకుంటూ- కళ్ళు విప్పి చుట్టూ చూసింది. చలపతి పట్టెకానుకుని, ఆమె జుట్టు పైకి తోశాడు. ఆమె కుడిచెయ్యిలేవలేదు. ఎడంచేత్తో పాణిగ్రహణంచేసింది. 'జీవితమంత' అనుభవాన్ని అతని 'స్మరణ'కు తెచ్చినట్లయింది ఆ స్పర్శ- ఆ చెయ్యి అలా బిగిసిపోయింది. సరస్వతి కథ అలా ముగిసిపోయింది.

"గొల్లు" మంటూ అంతా 'మంచాన్ని' చుట్టుముట్టారు.

"ఫెళ్ళు ఫెళ్ళు" మంటూ "మంచం" నేపధ్య సంగీతం వినిపించింది. ఏడుపులూ, ఎప్పుడో జరిగిన కథలూ, ఏరుకొచ్చిన మంచితనాలూ ఎంతో వికృతంగా తయారైంది వాతావరణం.

మంచం దించుతామన్నారు సుపుత్రులూ, చుట్టూ వాళ్ళూ. చలపతి వద్దని అరిచాడు వారించాడు.

"ఆ మంచం దానిదే- దానితో నే వుండాలి."

చలపతి చలనం లేకుండా రాత్రంతా సరస్వతి దగ్గరే ఉన్నాడు.

'కర్మసాక్షి కళు తెరుచుకుని రాత్రి జరిగిన దారుణాల్ని ఎర్రగా చూస్తున్నాడు. చలపతి ఇంటిముందు కాటికి కదులుతున్న కట్టెనీ, కట్టెల బండినీ, బండిలో విరిగిన మంచాన్నీ చూస్తున్నాడు.


## ట్రెయినీ కంపోజిటర్లు కావలెను

పేరొందిన ఇంగ్లీషు, తెలుగు ప్రింటింగ్ ప్రెస్‌కు ట్రెయినీ కంపోజిటర్లు కావలెను. ప్రారంభపు శిక్షణాకాలము ఆరు మాసాలు. పూర్తిగా శిక్షణ పొందిన వారిని కొందరిని అనుకూలమైన పని గంటలలో కంపోజిటర్లగా తీసుకోబడుదురు. మితమైన కుటుంబ బాధ్యతలతో చదువుకున్న గృహిణులకు (విజయవాడ నివాసితులు) యిదొక చక్కని అవకాశం. పూర్తి పేరు, చిరునామా, విద్యార్హతలు, ఇంకేమైనా ప్రత్యేక నిపుణతలు కలిగి వుంటే వాటిని వివరాలతో సాదా పేపరుపై పోస్టు బాక్స్ నెం-712, ఆంధ్రజ్యోతి, విజయవాడ—10 వారికి దరఖాస్తు చేయాలి. ఎన్నికైన అభ్యర్థినులకు ఉత్తరం ద్వారా తెలియపరచబడును.



## ఇది నిజమా!

"అదృష్టవంతులూ, అపార మేధాసంపత్తులూ మాత్రమే డాక్టర్లూ, ఇంజినీర్లూ కాగలరు"

కాదు. ముమ్మాటికీ కాదు.

లక్ష్యం, దాని సాధనకు కృషి వుంటే ప్రతి ఒక్కడికీ ఫలితం వుంటుంది. కానయితే దీనిలో కాలం పాత్ర విలువైనది. దీనికి గత 5 సం॥ల మాఫలప్రద శిక్షణానుభవమే ఋజువు. కాలం విలువైనది. దాన్ని వృథా చెయ్యకండి.

లక్ష్యం మీకుంటే సాధనా, కృషీ మేం చేయిస్తాం.

**M. B. B. S.,** మరియు **B. Tech.,** ఎంట్రెన్స్ పరీక్షల శిక్షణకై అడ్మిషను ప్రారంభింపబడినవి.

బాలికలకు ప్రత్యేక హాస్టలు వసతి కలదు.

తరగతులు— మే 24 నుండి

**ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్,**

స్టేట్ బ్యాంక్ వద్ద, కర్నూలు_518 004.